సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



'సన్నబియ్యం' దేశానికే ఆదర్శం

సన్నబియ్యం పంపిణీ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు.

- 10లో▸



21 నుంచి డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ పరిధిలో ఈ నెల 21 నుంచి డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
38.4⁰ /26.2⁰

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పనుల అడ్డగింత



కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా కాటారం మండలం గారెపల్లిలో చేపడుతున్న రిజర్వాయర్ బండ్ పనులను శుక్రవారం నిర్వాసిత రైతులు అడ్డుకున్నారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయి ఏళ్లు గడుస్తున్నా తమకు నష్టపరిహారం అందలేదని నిర్వాసిత రైతులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. భూమి కోల్పోయి, పంట నష్టపరిహారం అందక తమ కుటుంబాలు రోడ్డున పడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం అందించేంత వరకు పనులు సాగనివ్వబోమని రైతులు తేల్చిచెప్పారు. ఘటనా స్థలానికి చేరుకున్న ప్రాజెక్ట్ డీఈఈ ఉపేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎస్సై శ్రీనివాస్ రైతులకు నచ్చజెప్పడానికి ప్రయత్నించారు. సమస్య సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతులతో సమావేశం ఏర్పాటు చేసేలా చూస్తామని పేర్కొన్నారు. పనులు అడ్డుకున్న వారిలో నిర్వాసిత రైతులు రాజు, రాజయ్య తదితరులు ఉన్నారు.

పోక్సో కేసులో ఒకరికి జైలు శిక్ష

రేగొండ: పోక్సో కేసులో ఓ నిందితుడికి న్యాయస్థానం 55 రోజుల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పింది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కొటం రాజేందర్ అదే గ్రామానికి చెందిన ఓ యువతి ఫొటోలు తీసి ప్రేమించాలని వెంబడిస్తూ ఆ యువతి ఫొటోలను సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టు చేశాడు. దీంతో యువతి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. కేసు శుక్రవారం వాయిదాకు రాగా, పూర్వపరాలు పరిశీలించాక నేరం రుజువు కావడంతో నిందితునికి 55 రోజుల శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి నారాయణ బాబు తీర్పు చెప్పారు.

ఇంటి పైకప్పు ధ్వంసం



వాజేడు : మండల పరిధిలోని టేకులగూడెం గ్రామంలో శుక్రవారం వీచిన గాలి దుమారానికి ఇంటి పైకప్పు లేచి ధ్వంసమైంది. ఆర్ఐ కుమార స్వామి తెలిపిన వివరాల ప్రకారం ..మండల పరిధిలోని టేకులగూడెనికి చెందిన వనపర్తి సురేష్ ఇంట్లో ఒక్కసారిగా వీచిన గాలిదుమారంతో పైకప్పు లేచిపోయింది. సుమారుగా రూ.10వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆర్ఐ కుమారస్వామి తెలిపారు. అందుకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు పంపించినట్లు వెల్లడించారు.

నివేదిక ఆధారంగా నష్టపరిహారం




ములుగు : అకాల వర్షంలో నష్టపోయిన ప్రతి రైతుకు అధికారుల నివేదిక ఆధారంగా పరిహారం అందుతుందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ కోఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. అలాగే రైతులకు అండగా ఉంటానని మంత్రి సీతక్క హామీ ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట నష్టంపై సర్వే చేసి వెంటనే నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. అకాల వర్షంతో తడిసిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈదురుగాలులతో కూలిపోయిన ఇళ్ల బాధితులకు ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సమావేశంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, పొడాల ఓం ప్రకాశ్, కూనూరు అశోక్‌గౌడ్, ముసినపల్లి కుమార్‌గౌడ్, కక్కెర్ల అశోక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్‌రెడ్డి, నెల్లుట్ల రాజన్న, అనిల్, నూనేటి శ్యాం, మైనార్టీ సెల్ నాయకుడు ఎండీ షర్పొద్దీన్, వీరస్వామి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుంటోజు పావని నాయకులు పాల్గొన్నారు.

పథకాల పేరిట దందా?

రంగంలోకి దిగిన దళారులు

● రూ.లక్షల్లో వసూళ్లకు ప్రణాళిక.. ● గతంతోనూ మోసపోయిన బాధితులు



2023 సంవత్సరంలో కలెక్టర్, ఎస్పీ, ఇతర ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగాలు పెట్టిస్తామని పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు కల్పించకుండా మోసం చేశారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్పీ స్పందించి కేసు నమోదు చేయించారు. 24మంది నుంచి సుమారు రూ.50లక్షలకుపైగా వసూలు చేశారు. 2024 జూలై 18న ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీనివాసరావు, పట్టణానికి ఇద్దరు మధ్యవర్తులను అదుపులోకి తీసుకొని జైలుకు పంపించారు. ఇదే మాదిరిగా జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో బాధితులు ఫిర్యాదులు చేశారు.

గతంలో వందలాది మంది బాధితులు

జిల్లాకేంద్రంలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు పెట్టిస్తామని, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇప్పిస్తామని ప్రత్యక్ష్యంగా గత ప్రజాప్రతినిధులే రంగంలోకి దిగి ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారు. డబ్బులు ఇచ్చిన వారిలో కొంత మందికి లబ్ధిచెందగా ఇంకా కొంత మంది బాధితులు సంబంధిత వ్యక్తుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తుండగా.. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తించేలా చేస్తామని దళారులు మోసం చేస్తున్నారు. ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన ముగ్గురు వ్యక్తులపై గతంలో పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపిన ఘటనలు ఉన్నాయి.

భూపాలపల్లి అర్బన్: అధికారంలో ఏ పార్టీ ఉన్నా సరే.. ప్రభుత్వం కొత్త పథకం అమలుకు శ్రీకారం చుట్టిందంటే చాలు.. కొందరి పంట పండినట్లే. దరఖాస్తుల స్వీకరణ మొదలునుంచే ఆశావహులను ఆకర్షించే ప్రయత్నాలు ప్రారంభిస్తుంటారు. అమాయక ప్రజలు వారి మాటలకు ఆకర్షితులై ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందాలని లక్షలు సమర్పించి మోసపోతున్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రులు దళారులను ఆశ్రయించవద్దని సూచించినా.. మోసపోతూనే ఉన్నారు.

గతం నుంచీ ఇదే పరిస్థితి..

గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళితబంధు, కార్పొరేషన్ లోన్లు, ఇతరత్రా పథకాల కోసం చోటా, మోటా, బడా నాయకులు లబ్ధిదారుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కొంతమంది ప్రజాప్రతినిధులు డబ్బులు వసూలు చేసిన తర్వాత పథకాల లబ్ధి దరిచేరకపోవడంతో బాధితులు గొడవలకు దిగారు. పరువుపోవడంతో పాటు రాజకీయ భవిష్యత్ ఉండదనే భయంతో కొంతమంది వెంటనే బాధితులకు వారినుంచి వసూలు చేసిన డబ్బులను గుట్టుచప్పుడు కాకుండా ముట్టజెప్పిన ఘటనలు జిల్లాలో కోకొల్లలు ఉన్నాయి. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇంటింటి సర్వే ఇప్పటికే పూర్తయింది. అధికారులు అర్హుల ఎంపికలో తలమునకలై ఉండగా, దళారులు వసూళ్లకు తెరలేపారు. ప్రస్తుతం రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుంది. ప్రభుత్వ లబ్ధిపొందాలనే వారిని గుర్తించి వారి ఆశలను వీరంతా సొమ్ము చేసుకుంటున్నారు. ఏ పథకం దరిచేరాలన్నా రేషన్‌కార్డు ప్రామాణికంగా ఉండటంతో జిల్లాలో రేషన్‌కార్డుల కోసం చాలామంది అర్హులు, అనర్హులు(ఉద్యోగస్తులు) దరఖాస్తు చేసుకున్నారు. కొంత మంది ఆర్థికంగా ఉన్నవారికి సైతం రేషన్‌కార్డులు ఇప్పిస్తామని రూ.10వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో దృష్టిసారిస్తే అక్రమాలు బహిర్గతమయ్యే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

పరీక్షల పేరుతో వసూళ్లు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్త పరీక్షల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆస్పత్రికి వివిధ అనారోగ్య సమస్యలతో వచ్చిన పేషెంట్లను డాక్టర్లు పరీక్షించి వివిధ రకాల రక్త పరీక్షలు రాస్తున్నారు. అందులో భాగంగా కొంతమందికి 'ఎలక్ట్రోలైట్స్' రక్త పరీక్షను కూడా రాస్తున్నారు. రక్త పరీక్షకు సంబంధించి పరికరాలు అందుబాటులో లేకపోవడంతో బయట చేసుకోవాల్సి ఉంటుందని ల్యాబ్ టెక్నీషియన్లు రోగులకు చెబుతున్నారు. ఈ పరీక్ష ప్రైవేట్ ల్యాబ్‌లో చేయాలంటే రూ.800 ఉంటుందని వసూళ్లు చేస్తున్నట్లు పలువురు పేషెంట్లు ఆరోపిస్తున్నారు. ప్రైవేట్ ల్యాబ్‌లో రూ.300నుంచి రూ.500వరకు ఖర్చు అవుతుండగా అదనంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఎలక్ట్రోలైట్స్ పరీక్ష చేయకుండానే హైదరాబాద్, వరంగల్‌కు చెందిన ల్యాబ్ ప్యాడ్స్‌పై సొంతంగానే ప్రింట్ తీసి పేషెంట్లకు అందజేస్తూ మోసం చేస్తున్నారు. ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు, ఇద్దరు నర్సింగ్ అధికారులు ఈ దందాకు తెరలేపినట్లు ఆస్పత్రిలో చర్చించుకుంటున్నారు.



ఆస్పత్రిలో రక్త నమూనాలు సేకరించే గది

చర్యలు తీసుకుంటాం..

ఆస్పత్రిలో టెస్టు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్‌కు పంపకతప్పడం లేదు. త్వరలో నేరుగా ప్రైవేట్ ల్యాబ్ వారితో మాట్లాడి వారి వచ్చి నమూనాలు తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తాం. ఇందుకు అయ్యే ఖర్చు ఆస్పత్రి నుంచి చెల్లిస్తాం. అక్రమ దందాను ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు కూడా వచ్చాయి. దీనిపై విచారణ చేస్తున్నాం.

- డాక్టర్ నవీన్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

మీసేవలో సర్వర్ డౌన్

వెంకటాపురం (కె) : రాజీవ్ యువ వికాసం పథకం కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు రాగా మీసేవ కేంద్రంలో శుక్రవారం సర్వర్ డౌన్ సమస్య తలెత్తింది. దీంతో దరఖాస్తు దారులు ఇబ్బందులు పడ్డారు. శనివారం, ఆదివారం సెలవులు రావడంతో సోమవారం ఒక్కరోజే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. మీసేవ కేంద్రాల వద్ద అధిక సంఖ్యలో దరఖాస్తులు చేస్తుడడంతో కేంద్రం నిర్వాహకులు రాత్రి 9గంటల వరకు సర్వర్ పని చేస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని చెబుతున్నారు. చేసేదేమీ లేక పూర్తి చేసిన అన్ని పత్రాలను ఇచ్చి వెళ్లాలని మీసేవ సిబ్బంది తెలుపుతున్నారు. దరఖాస్తుకు రెండ్రోజుల గడువు ఉండడంతో నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బారులుదీరిన దరఖాస్తు దారులు

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాసచారి



శ్రీనివాసచారి



శ్రావణ్‌రావు

భూపాలపల్లి అర్బన్: జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వలబోజు శ్రీనివాసచారి ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలో 71 ఓట్లు ఉండగా 70మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటింగ్ నిర్వహించి 6గంటల వరకు కౌంటింగ్ నిర్వహించారు. కూనురు సురేష్‌కుమార్‌పై వలబోజు శ్రీనివాసచారి 20ఓట్ల మెజారిటీతో అధ్యక్షుడిగా గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఆనంద రావుపై విలా శ్రావణ్‌రావు 17ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. సహాయ కార్యదర్శిగా సంగెం రవీందర్, కోశాధికారిగా రాజ్‌కుమార్, ఈసీ మెంబర్లుగా రమేష్‌నాయక్, రాకేష్, ప్రశాంత్, రవీందర్, మహిళా సభ్యురాలిగా సుధారాణి ఎన్నికయ్యారు.

కోర్టు ఏర్పాటుకు కృషి చేశా..

జిల్లా కోర్టు, సివిల్ కోర్టుల ఏర్పాటుకు మొదటి నుంచి కృషి చేశాను. అధికారులు, ప్రజాప్రతినిధులను పలుమార్లు కలిసి కోర్టు ఏర్పాటు చేయాలని కోరాను. కోర్టు ఏర్పాటుకు ముందు పరకాల, హనుమకొండ, ములుగు, మంథని కోర్టులకు వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నాటి సేవలను గుర్తించి న్యాయవాదులు అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. న్యాయవాదులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- శ్రీనివాసచారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

భూ సేకరణ త్వరగా పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రధాన కాల్వల నిర్మాణం కోసం చేపడుతున్న భూ సేకరణ ప్రక్రియలో వేగంపెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ భూ సేకరణ విభాగం అధికారులకు సూచించారు. కాటారం మండలం గుమ్మాళ్లపల్లి, గూడూరు గ్రామాల్లో కొనసాగుతున్న భూ సేకరణ సర్వేను అదనపు కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. భూ నిర్వాసిత రైతులతో మాట్లాడారు. పలువురు నిర్వాసిత రైతులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. భూ సేకరణకు అధికారులకు రైతులు సహకరిస్తే కాల్వల నిర్మాణ పనులు త్వరగా పూర్తవుతాయని.. తద్వారా సాగు నీరందుతుందని తెలిపారు. రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. భూ సేకరణ సర్వేలో అడ్డంకులు అధిగమించి సేకరణ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణలో పాటించాల్సిన నిబంధనలు, విధానం గురించి భూ సేకరణ అధికారులకు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, ఆర్ఐ వెంకన్న, భూ సేకరణ అధికారులు, ఇరిగేషన్ ఏఈఈలు, సిబ్బంది ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

నల్లబ్యాడ్జీలతో నిరసన



ఉపాధి పనుల వద్ద నల్లబ్యాడీలతో నిరసన వ్యక్తం చేస్తున్న డేంజర్ జోన్ నిర్వాసితులు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్‌కు 500మీటర్ల పరిధిలోని పెద్దతాడిచర్ల డేంజర్ జోన్ నిర్వాసితులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాడిచర్ల, కాపురం జెన్‌కో భూ నిర్వాసితుల సాధన కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి మాట్లాడుతూ.. డేంజర్ జోన్ భూముల సేకరణపై స్పష్టత లేకుండానే ఓపెన్‌కాస్ట్ ఏఎమ్మార్ కంపెనీ అధికారులు 100 మీటర్ల పరిధిలో మట్టిని డంపింగ్ చేయడానికి ప్రయత్నించడంతో అడ్డుకొని వెనక్కి పంపించినట్లు తెలిపారు. నిరసనగా తాడిచర్ల చింతలకుంట వద్ద ఉపాధి పనులు చేస్తున్న డేంజర్ జోన్‌కు సంబంధించిన ఉపాధి కూలీలతో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. నల్లబ్యాడ్జీలు ధరించి పనిచేయడం ఐక్యతను నిదర్శనమని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, ప్రభుత్వం స్పందించి డేంజర్ జోన్ ఇళ్లను సేకరించి, నష్టపరిహారం, పునరావాస కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గేదెలు మృతి

ములుగు రూరల్ : బండారుపల్లి గ్రామానికి చెందిన గూడెపు శంకర్‌కు చెందిన మూడు గేదెలను గురువారం రాత్రి షెడ్‌లో కట్టేశాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాడి గేదెలు మృతి చెందాయి. కాగా బాధిత కుటుంబానికి గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకొని మృతిచెందిన మూడు గేదెలను పరిశీలించారు.

మహనీయుడు పూలే

● ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియ వేగిరం
● కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: సామాజిక, సమానత్వ సాధన కోసం కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిబాపూలే అని కలెక్టర్ రాహుల్ శర్మ కొనియాడారు. ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పూలే దూరదృష్టి, సామాజిక సేవా దృక్పథం నేటితరానికి మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి శైలజ, డీఈఓ రాజేందర్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు

నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ శర్మ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి 22వ తేదీ వరకు చేపట్టనున్న పోషణ్ పక్వాడ కార్యక్రమాల షెడ్యూల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పూలేకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

గ్రౌండింగ్ ప్రక్రియ వేగిరం చేయాలి..

ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయం నుంచి శుక్రవారం వివిధ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కాటారం డివిజన్‌లో లబ్ధిదారుల విచారణ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఎంపికైన లబ్ధిదారులకు అవగాహన కల్పించి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఉపాధిహామీ పథకం పనులకు పెద్దఎత్తున లేబర్‌ను మొబలైజ్ చేయాలని తెలిపారు. జిల్లాలో ఉపాధిహామీ పథకం పనుల్లో ఆశించిన ప్రగతి రావడం లేదన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ నరేష్, డీపీఓ నారాయణరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పుష్కరాలు విజయవంతం చేయాలి..

సరస్వతి పుష్కరాలను సమన్వయంతో అన్ని విభాగాల అధికారులు టీమ్ వర్క్‌తో విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ సూచించారు. శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, పర్యాటక శాఖ ఎండీ ప్రకాశ్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, ఇతర శాఖల అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పుష్కరాల సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. అనంతరం శైలజా రామయ్యర్ మాట్లాడుతూ.. సరస్వతి పుష్కరాల ప్రాధాన్యతను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భక్తులకు సమాచారం అందించేందుకు ప్రత్యేక యాప్ రూపకల్పన జరుగుతుందన్నారు. టెంట్ సిటీ ఏర్పాటుకు సంబంధించి పర్యాటక శాఖ ఎండీ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ నుంచి అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి మందులు నిల్వ ఉండాలి



మందులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

ములుగు/ములుగు రూరల్ : ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మందుల నిల్వలు ఉండే విధంగా చూసుకోవాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జాకారం, ములుగు ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలోని గర్భిణులకు, బాలింతలకు, వృద్ధులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని తెలిపారు. ఓఆర్ఎస్, జింక్ కార్నర్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మందుల నిల్వల రిపోర్టులను రోజువారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రాల మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ జితేందర్, నవ్య, సూపర్‌వైజర్ దేవమ్మ, ఆరోగ్య కార్యకర్తలు తిరుమల, నర్సమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గోదావరికి హారతి

కాళేశ్వరం: పౌర్ణమి సందర్భంగా కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరికి శనివారం(నేడు) సాయంత్రం 5.30గంటలకు హారతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు హారతి కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

ఓపెన్‌కాస్టు తవ్వకాలను అడ్డుకుంటాం

భూపాలపల్లి అర్బన్: గడ్డిగానిపల్లి గ్రామంలో అధికారులు కూల్చేసిన రేకులషెడ్లు, పెంకుటిళ్లకు నష్టపరిహారం చెల్లించకుంటే కేటీకే-2 ఓపెన్ కాస్ట్ గని తవ్వకాలను అడ్డుకుంటామని బాధితులు తెలిపారు. కూల్చేసిన ఇళ్ల వద్ద శుక్రవారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా సింగరేణి యాజమాన్యం భూనిర్వాసితులకు నష్టపరిహారం సకాలంలో చెల్లించకుండా కాలయాపన చేయటంతో తీవ్రంగా నష్టపోయినట్లు ఈ సందర్భంగా గ్రామస్తులు చల్లూరి సమ్మయ్య, సెగ్గం సిద్ధూ ఆరోపించారు. 2008లో ఓసీపీ-2 కోసం గడ్డిగానిపల్లి గ్రామంలో భూములను పూర్తిగా సింగరేణి స్వాధీనం చేసుకుని, గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలిస్తామని అధికారులు చెప్పి ఏళ్లు గడుస్తున్నాయన్నారు. ఇంతవరకు వేరే ఏరియాకు తరలించకపోవడం వల్ల ఓపెన్‌కాస్ట్ నుంచి ఏర్పడుతున్న దుమ్ము ధూళితో గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామస్తులు కొందరు వారి పట్టా భూముల్లో ఇళ్లు నిర్మించుకుంటే రాత్రి పూట సింగరేణి, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు వచ్చి కూల్చేయడం సరైంది కాదన్నారు. ఈ మేరకు అడ్డుకున్న కొంతమంది మహిళలను అధికారులు బెదిరించడంతో పాటు సెల్‌ఫోన్లు బలవంతంగా తీసుకుని, మొత్తం 65 ఇళ్లను నేలమట్టం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కూల్చేసిన ఇళ్లకు పరిహారం చెల్లించకుంటే ఓసీపీ-2 పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు రత్నాకర్, సదానందం, కుమార్, ప్రభుదాస్, మధుకర్, దేవేందర్, సంతోష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఇళ్ల వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

డివిజినల్ అధికారి సత్తయ్య

ఏటూరునాగారం : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ డివిజినల్ అధికారి సత్తయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో ఫైర్ ఆక్సిడెంట్ జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగినప్పుడు కంగారు పడకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేసి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. మంటలకు మరింత తోడునందించే పదార్థాలు ఏమైనా ఉంటే వెంటనే వాటిని దూరంగా పడేయాలని అన్నారు. విద్యుత్ సరఫరా సమయంలో అగ్ని ప్రమాదం జరిగితే కర్ర సాయంతో తొలగించాలన్నారు. కరెంట్ సరఫరా ఉన్న వస్తువులపై వెంటనే నీరు పోయొద్దని తెలిపారు. ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే 101, 87126 85772 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి శుక్రవారం మండలంలోని జన సమూహాలు ఉన్న ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు సత్తయ్య వివరించారు.ఈ కార్యక్రమంలో లీడ్ ఫైరింగ్ ఆస్పత్రి రవికుమార్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

క్లుప్తంగా

సైక్లింగ్ రోడ్ పోటీలకు కేయూ జట్టు



పురుషుల జట్టుతో స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ

కేయూ క్యాంపస్: బికనీర్‌లోని మహారా గంగాసింగ్ యూనివర్సిటీలో ఈనెల 10 నుంచి నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ సైక్లింగ్ రోడ్(పురుషుల) పోటీలకు కేయూ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్య శుక్రవారం తెలిపారు. జట్టులో ఎస్.రాకేష్(శ్రీఅరుణోదయం డిగ్రీ కాలేజీ హనుమకొండ), ఎండీ.రియాజ్(మాస్టర్జీ డిగ్రీ కాలేజీ హనుమకొండ), జె.సంజీవ్, జి.లోకేష్(వరంగల్ కిట్స్), ఎన్.మహేందర్‌యాదవ్(యూసీపీఈ కేయూ), కె.బాలమురుగన్ (ఎల్‌బీ కాలేజీ వరంగల్) ఉన్నారు. వీరికి హనుమకొండలోని జాగృతి డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ ఎ.రాజేష్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారని వెంకయ్య పేర్కొన్నారు.

సెలవు రోజుల్లో ప్రత్యేక టూర్ ప్యాకేజీ



హన్మకొండ: పర్యాటక ప్రాంతాల సందర్శనకు సెలవు రోజుల్లో ప్రత్యేక టూర్ ప్యాకేజీని తీసుకొచ్చినట్లు తెలంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ డిప్యూటీ మేనేజర్(మార్కెటింగ్) టి.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండో శనివారం, ఆదివారం, అంబేడ్కర్ జయంతి రోజు సోమవారం వరంగల్, రామప్ప, లక్నవరం ప్రాంతాల పర్యటనకు ప్రత్యేక టూర్ ప్యాకేజీ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఉదయం 8 నుంచి రాత్రి 7.30 వరకు పర్యాటక ప్రాంతాల సందర్శన ఉంటుందని పేర్కొన్నారు. ఏసీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. చార్జీలు పెద్దలకు రూ.980, పిల్లలకు రూ.790గా నిర్ణయించినట్లు వివరించారు. భోజన చార్జీలు రూ.150, బోటింగ్ చార్జీలు రూ.50 అదనం అని తెలిపారు. పర్యాటకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అందుబాటులోకి టీజీ ఎన్పీడీసీఎల్ యాప్

హన్మకొండ: ఐఫోన్ వినియోగదారులకు టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్ రావు, వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతం రెడ్డి తెలిపారు. మరిన్ని సాంకేతిక అంశాలు జోడించి టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను ఆధునీకరించినట్లు వారు వేర్వేరు ప్రకటనలో వెల్లడించారు. ఐఫోన్ యాప్ స్టోర్ నుంచి టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడు చేసుకోవచ్చన్నారు. ఈ యాప్‌లో 20 ఫీచర్లు ఉన్నాయని వివరించారు. రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్, కన్స్యూమర్ గ్రీవెన్సెస్, న్యూ కంప్లైంట్, కంప్లైంట్ స్టేటస్, రీఓపెన్, సెల్ఫ్ రీడింగ్, పే బిల్స్, బిల్ హిస్టరీ, ఆన్ లైన్ పేమెంట్ హిస్టరీ, కొత్త సర్వీస్ స్థితి, లింక్ ఆధార్ – మొబైల్, డొమెస్టిక్ బిల్ క్యాలిక్యులేటర్, కొత్త కనెక్షన్ ఎలా తీసుకోవాలి, పేరు– లోడ్ మార్పు, పవర్ కంజమ్షన్ గైడ్‌లైన్స్, టారిఫ్ డీటెయిల్స్, ఎనర్జీ సేవింగ్ టిప్స్, సేఫ్టీ టిప్స్, ఫీడ్ బ్యాక్, మై అకౌంట్, వినియోగదారుల బిల్లు సమాచారం, వినియోగదారుల పరిధిలోని అధికారి వివరాలు, కాంటాక్ట్ అజ్.. అనే ఫీచర్లు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయని వివరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

బయ్యారం: వితంతు మహిళపై లైంగికదాడికి యత్నించిన వ్యక్తిపై శుక్రవారం బయ్యారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సమీపంలో నివసించే కె.కార్తీక్ గురువారం రాత్రి ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లోకి వెళ్లాడు. ఈ క్రమంలో లైంగిక దాడికి యత్నించటంతో మహిళ కేకలు వేయగా కార్తీక్ పరారయ్యాడు. ఈ మేరకు బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య

బచ్చన్నపేట: మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కట్కూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనుగుల లక్ష్మి(59)కి ఇటీవల అనారోగ్య సమస్యలతోపాటు మానసికంగా కూడా సరిగా ఉండడంలేదు. ఈక్రమంలో శుక్రవారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని వచ్చేలోగా లక్ష్మి ఉరివేసుకుని కన్పించింది. మృతురాలికి భర్త ఎల్లయ్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని ఎస్సై ఎస్‌కే హమీద్ పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నియామకం ఎప్పుడు?

కేయూలో 332 అధ్యాపక పోస్టులు ఖాళీ



కాకతీయ యూనివర్సిటీ గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

- వర్సిటీల్లో నియామకాలపై మార్గదర్శకాల జీఓ 21 జారీ
- కొందరు ఆశావహుల్లో చిగురించిన ఆశలు!
- కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోరుబాట
- రెగ్యులరైజ్ చేశాకే మిగిలిన పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రభుత్వం జీఓ 21ను విడుదల చేయడం తెలిసిందే. దీంతో కేయూలోని వివిధ విభాగాల్లో, యూనివర్సిటీ కాలేజీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిలో ఆందోళన మొదలైంది. తాము 20 ఏళ్లుగా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నామని, తమను రెగ్యులరైజ్ చేశాకే మిగతా పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని ఆందోళనలు చేస్తున్నారు. రెండ్రోజుల క్రితం హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యామండలిని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ముట్టడించారు. యూజీసీ నిబంధనల ప్రకారం వీరి రెగ్యులరైజేషన్ సాధ్యమా కాదా అనేది ఇప్పుడు చర్చగా మారింది. సాధ్యం కాకపోతే వీరికి నియామకాల్లో వేయిటేజీ ఇవ్వాలనే చర్చ కూడా ఉంది.

నియమకాలు జరిగేనా?

వర్సిటీలో 409 మంది రెగ్యులర్ అధ్యాపకులు (అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్) పోస్టులు మంజూరి ఉండగా.. అందులో ప్రస్తుతం 77 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అన్ని విభాగాలు కలిపి ప్రొఫెసర్లు 51, అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులు 87, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు 194 మొత్తంగా 332 పోస్టులు వేకన్సీలుగా ఉన్నాయి. కాగా.. నియామక ప్రక్రియలో ఎందరిని భర్తీ చేస్తారు? ప్రస్తుతం కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న వారికి వెయిటేజీ ఇస్తారా.. లేదా.. అనే చర్చ జరుగుతోంది.

కొన్నేళ్ల క్రితమే

కేయూలో 15 ఏళ్లుగా అధ్యాపకుల నియామకాలు లేవు. దీంతో రెగ్యులర్ అధ్యాపకుల కొరత వేధిస్తోంది. కొన్నేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేయూకు 136 పోస్టుల అధ్యాపకుల నియామకానికి మంజూరు ఇచ్చింది. కానీ వివిధ కారణాలతోనే ప్రభుత్వమే ఆయా పోస్టుల నియామకానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో రెగ్యులర్ అధ్యాపకుల కొరత ఉంది. నాణ్యమైన విద్య, పరిశోధనలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లోనూ అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ఉపక్రమించబోతుందనేది అందుకు మార్గదర్శకాలు కూడా వెలువడడంతో కొందరు ఆశావహుల ఆశలు చిగురించాయి. అయితే ఏయే వర్సిటీల్లో ఎన్ని వేకెన్సీలు భర్తీ చేస్తారు? అనే అంశంపై ఇప్పటి వరకు స్పష్టత లేదు.

177 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కాకతీయ యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో యూనివర్సిటీ వివిధ కాలేజీల్లో కలిపి 177 మంది వరకు కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు పని చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించి ప్రస్తుతం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం భర్తీ చేస్తే తమకు ఉద్యోగాలు రావని వారు ఆ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నారు. గురువారం కేయూ బంద్‌ను పాటించటంతోపాటు పరిపాలనా భవనం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. శుక్రవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారికి తెలిపినప్పటికీ తమకు ఉద్యోగ భద్రత కల్పించాకే ఆందోళనలు విరమిస్తామని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చెబుతున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

విభాగాల వారీగా పోస్టులు ఇలా..

విభాగం	ఖాళీ పోస్టులు
బాటనీ	20
బయోటెక్నాలజీ	03
బిజినెస్ మేనేజ్‌మెంట్	05
కెమిస్ట్రీ	20
ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ	09
సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ సెంటర్	04
కామర్స్	28
ఎకనామిక్స్	21
ఎడ్యుకేషన్	04
ఇంగ్లిష్	21
జియాలజీ	11
హిందీ	05
హిస్టరీ	08
ఇన్‌ఫార్మెటిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్	02
లా	05
లైబ్రరీ సైన్స్	01
మేథమెటిక్స్ స్టాటిస్టిక్స్	10
మైక్రోబయాలజీ	01
ఫార్మసీ	15
ఫిజికల్ ఎడ్యుకేషన్	03
ఫిజిక్స్	14
పొలిటికల్ సైన్స్	08
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్	16
సంస్కృతం	01
సోషియాలజీ	05
తెలుగు	12
ఉర్దూ	02
జువాలజీ	17
ఇంజినీరింగ్ యూసీఈ కొత్తగూడెం	13
ఇంజనీరింగ్ కేయూ సీఈ అండ్ టీ	34
ఎస్‌డీఎల్‌సీఈ	14

క్రమబద్ధీకరించాకే నియామకాలు చేపట్టాలి..



కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాకే అందరినీ అబ్జార్బ్‌న్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాకే యూనివర్సిటీల్లో మిగిలిన పోస్టుల్లో నియామకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.యూజీసీ సెవంత్ పే బేసిక్ ప్లస్ డీఏ, హెచ్ఆర్ఏ, మూడు శాతం ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కూడా కోరుతున్నాం. అన్ని వర్సిటీల్లో కలిపి 1,270 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పని చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ఆందోళనలు కొనసాగిస్తాం.

– శ్రీధర్‌కుమార్‌లోథ్, కుక్టా అధ్యక్షుడు

సన్న బియ్యం పథకం దేశానికే ఆదర్శం



రేషన్ బియ్యం లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, కలెక్టర్, అధికారులు

- పంచాయతీరాజ్, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- గుంజేడులో సన్న బియ్యం పథకం ప్రారంభం

కొత్తగూడ: సన్న బియ్యం పంపిణీ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పరిధి గుంజేడులో సన్న బియ్యం పథకాన్ని శుక్రవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిరుపేదల కడుపు నింపాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యంతో వండిన ఆహారాన్ని చిన్నారులతో కలసి భుజించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్‌ను సందర్శించారు. చిన్న పాపకు ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహార ఉగ్గును స్వయంగా తినిపించారు. గర్భిణులకు పౌష్టికాహార కిట్లు అందజేశారు. అనంతరం కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, డీఎఫ్ఓ విశాల్‌తో కలిసి ముసలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గూర్చి అధికారులతో చర్చించారు. గుంజేడు ముసలమ్మ జాతరను ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ..కొత్తగూడ, గంగారం మండలాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. 30 పడకల ఆస్పత్రి భవణ నిర్మాణం స్థల కేటాయింపులో జాప్యంపై సమీక్షించిన మంత్రి.. సమస్యలుంటే పరిష్కరించి ఆస్పత్రి నిర్మాణం జరిగేలా చూడాలని కలెక్టర్, డీఎఫ్ఓలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి, డీడబ్ల్యూఓ ధనమ్మ, డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీఎస్ఓ ప్రేమ్‌కుమార్, సీడీపీఓ షబానా అజ్మీ, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తాం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణానికి భూమి పూజ



భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే నాగరాజు, 'కుడా' చైర్మన్, కలెక్టర్

రామన్నపేట : నగరంలోని వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రూ.28 కోట్ల నిధులతో నిర్మించనున్న నూతన భవన నిర్మాణానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. 70 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2014 సంవత్సరం తెలంగాణ ఆవిర్భావం నాటికి అత్యంత శిథిలావస్థకు చేరుకుందని, ఈ విషయాన్ని నాటి విద్యార్థి నాయకులు, విద్యార్థులు సాంకేతిక విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇటీవల పూర్వ విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్.. విషయం తెలియజేయడంతో నూతన భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రూ.28 కోట్లు విడుదల చేసి అభివృద్ధి పనులు ప్రారంభించాలని సూచించినట్లు తెలిపారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ప్రభుత్వ ఇంజనీరింగ్ విద్య అందించడమే కాకుండా ప్రభుత్వ జాబ్ క్యాలెండర్, స్వయం ఉపాధి పథకాల ద్వారా వారికి ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు, 'కుడా' చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, రామ్‌ప్రసాద్, కళాశాల పూర్వ విద్యార్థి సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ.వి శ్రీనివాస్‌రావు, మేకల అక్షయ్‌కుమార్, శ్రీవిద్య, కుమ్మరి వేణు, బానోత్ వెంకన్న, రవితేజ, కుమార్, దయాకర్, శ్రీ లేఖ, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రామనారాయణ, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే కృషి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వరుణ్ రెడ్డి



మాట్లాడుతున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

హన్మకొండ: అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిబా పూలే అని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎండీ మాట్లాడుతూ.. కులం పేరుతో తరతరాలుగా అణిచివేతకు గురైన ప్రజలకు ధైర్యం కల్పించిన వ్యక్తి పూలే అని కొనియాడారు. స్త్రీలు అభివృద్ధి చెందితే సమాజం అభివృద్ధి చెందుతుందని, స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్పసంస్కర్త జ్యోతిబా పూలే అన్నారు. 1873 సెప్టెంబర్ 24న సత్యశోధన సమాజాన్ని స్థాపించారని, పూలే కేవలం కులవ్యవస్థ రూపు మాపడమే కాకుండా సామ్రాజ్యవాద వ్యతిరేక, కార్మికవర్గ, రైతాంగ పక్షంగా పోరాడారని వివరించారు. పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఇంచార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్ లాల్, వి.తిరుపతి రెడ్డి, టి.మధుసూదన్, సీఈలు కె.తిరుమల్‌రావు, రాజుచౌహాన్, రవీంద్రనాథ్, బికంసింగ్, వెంకటరమణ, జాయింట్ సెక్రటరి కె.రమేష్, జీఎంలు అన్నపూర్ణ, వేణుబాబు, వాసుదేవ్, నాగప్రసాద్, శ్రీనివాస్, మల్లికార్జున్, దేవేందర్, కృష్ణమోహన్, గిరిధర్, సత్యనారాయణ, కంపెనీ సెక్రటరీ కె.వెంకటేశం పాల్గొన్నారు.

గొప్పసామాజిక సంఘ సంస్కర్త

కేయూ క్యాంపస్: మహాత్మాజ్యోతిబా పూలే గొప్ప సామాజిక సంఘసంస్కర్త అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పూలే జయంతిని యూనివర్సిటీలోని సెనెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య ద్వారానే అసమానతలు తొలగిపోతాయని విద్యా ప్రాధాన్యతను పూలే ఆనాడే చాటిచెప్పారన్నారు. పూలేను స్ఫూర్తి, ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కాన్‌స్టిట్యూషన్ రెలవెన్స్ సోషియో ఎకనామిక్ పొలిటికల్ అండ్ ఎడ్యుకేషనల్ ఇంప్లికేషన్ ఆన్ బీసీస్ ఇన్ తెలంగాణ అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాస్ కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు సిరికొండ సంజీవరావు, కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు. పాలకమండలి సభ్యులు ఆచార్య సురేష్‌లాల్, డాక్టర్ అనితారెడ్డి, మల్లం నవీన్, సుకుమారి, చిర్ర రాజు, పుల్లూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. తొలుత కేయూ దూర విద్యా కేంద్రంలోని పూలే దంపతుల విగ్రహాలకు వీసీ, రిజిస్ట్రార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోధన, బోధనేతర సిబ్బంది, పలువురు పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ



పూజకు జ్ఞాపిక అందజేస్తున్న బ్రహ్మకుమారీలు

మామునూరు: ధ్యాన యోగాతో ప్రతిఒక్కరికీ మానసిక ప్రశాంతత లభిస్తుందని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలోని ఆడిటోరియంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం మానసిక ప్రశాంతతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ పూజ హాజరై మాట్లాడారు. పోలీస్ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేయాలని, ఎలాంటి మానసిక వత్తిడి గురికావొద్దని సూచించారు. ఉదయాన్నే వాకింగ్, ధ్యాన యోగా చేస్తే ఆరోగ్యంతోపాటు మనసుకు ప్రశాంతత, రోజంతా సంతోషం లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, భిక్షపతి, ఏఓ కల్పనరెడ్డి, డాక్టర్ సుధీర్, ఆర్ఐలు చంద్రశేఖర్, నవీన్‌కుమార్, కాశీరామ్, మహేష్, సీఎల్ఐ అశోక్, సుధాకర్, ఏఎల్ఐ దేవేందర్‌రెడ్డి, దీపక్, సమ్మిరెడ్డి ఆర్ఎస్ఐ రాజేష్, సుధాకర్, దశరథం, అరుణ, అనిల్, సీసీ రామాంజన్‌రెడ్డి, పీఆర్ ఓ రామాచారి, తహెర్ అలీ, సిబ్బంది పాల్గొన్నారు.

21నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, బీ ఒకేషనల్ తదితర కోర్సుల 2, 4, 5, 6 పరీక్షల టైం టేబుల్‌ను పరీక్షల విభాగం అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఈనెల 21వ తేదీ నుంచి రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి రాజేందర్ తెలిపారు. ఈనెల 21, 23, 25, 28, 30, మే 2, 5, 7తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. డిగ్రీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22, 24, 26, 29, మే 1, 3, 6, 8, 14 తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 5వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24, 26, 29, మే 1, 3, 6, 8, 14, 15, 16, 17 ,19, 20 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తారని వెల్లడించారు. 6వ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21, 23, 25, 28, 30, మే 2, 5, 7, 9, 15, 16,17, 19 తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహిస్తారని రాజేందర్ తెలిపారు. ఈపరీక్షల అనంతరం డిగ్రీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ల పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రైవేట్ యాజమాన్యాలతో సమావేశం

డిగ్రీ కోర్సుల పరీక్షల టైంటేబుల్‌ను విడుదల చేసినప్పటికీ కేయూ పరిధిలోని ఎక్కువ శాతం ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ఇంకా విద్యార్థుల పరీక్షల ఫీజులు పరీక్షల విభాగానికి చెల్లించలేదు. విద్యార్థులనుంచి పరీక్షల ఫీజులు వసూలు చేశారు. దీంతో ఈనెల 16న యూనివర్సిటీ అధికారులు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్ బాధ్యులు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించనుననట్లు సమాచారం. ఈ సమావేశంలో పరీక్షల ఫీజులు చెల్లించడంతోపాటు పరీక్షలను నిర్వహించాలని కోరనున్నట్లు తెలిసింది. అయితే ప్రైవేట్ యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వం తమకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తేనే పరీక్షలను నిర్వహిస్తామని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి



వీరేందర్ (ఫైల్)

దామెర: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన హనుకొండ జిల్లా దామెర మండలంలోని తక్కళ్లపహాడ్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన కథనం ప్రకారం.. నగరంలోని 3వ డివిజన్ ఆరెపల్లికి చెందిన సుంకరి వీరేందర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా శుక్రవారం పనినిమిత్తం తన అత్తగారి ఊరైన అగ్రంపహాడ్‌కు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో దామెర మండలంలోని తక్కళ్లపహాడ్ పాఠశాల సమీపానికి రాగానే జాన్‌డీర్ ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వాహనంపై ఉన్న వీరేందర్ ఎగిరిపడ్డాడు. అనంతరం ట్రాక్టర్ అతనిపై నుంచి వెళ్లింది. దీంతో తీవ్రగాయాలతో వీరేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని ట్రెయినీ ఎస్పీ మనన్ భట్, ఎస్సై అశోక్ పరిశీలించి, వివరాలు సేకరించారు. వీరేందర్ భార్య సుంకరి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

సరస్వతీ పుష్కర ఔషధ సేకరణపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్

ఎంజీఎం : కాళేశ్వరంలో మే 12వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 12 రోజుల పాటు జరిగే సరస్వతీ పుష్కరాల వైద్యశిబిరాలకు అవసరమైన ఔషధాల కోసం శుక్రవారం హనుమకొండ సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్‌లో భూపాలపల్లి డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ సమీక్ష నిర్వహించారు. ఈ పుష్కరాలకు సుమారు 10లక్షల నుంచి 12 లక్షల వరకు భక్తులు రానున్నట్లు అంచనా వేశారు. కాళేశ్వరంతో తాత్కాలికంగా 30 పడకల ఆస్పత్రితోపాటు మహదేవపూర్‌లో 30 పడకల సీహెచ్‌సీ సేవలను వినియోగించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇవేకాకుండా 10 ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గైనకాలజీ, సర్జరీ, అనస్తీషియా, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ వంటి ప్రత్యేక వైద్యసేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. అవసరమైన మందులను సమకూర్చేందుకు డీహెచ్ రవీంద్రనాయక్, టీఎస్ఎంఎస్ఐడీసీ రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయి ఔషధాలు అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీఎంఎస్ ఈఈ ప్రసాద్, ఫార్మసిస్టులు ఉప్పు భాస్కర్, నళిని, సదయ్య పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై రైతులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న రాజన్న

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిపతి కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత మిషన్ నేతృత్వంలో శుక్రవారం వేరుశనగ సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేవీకే సీనియర్ శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ రాజన్న హాజరై వేరుశనగ సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. రైతులకు టీసీజీఎస్–1694(విశిష్ట) వేరుశనగ సాగు వివరాలను రైతులకు వివరించారు. అనంతరం రైతులకు టీ సీజీఎస్ 1694 రకం వేరు శనగ విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ సౌమ్య, రాజు, రైతు కోఆర్డినేటర్ రాజిరెడ్డి, హర్షరెడ్డి, సాయిచంద్, రైతులు పాల్గొన్నారు


పెద్దపులి సంచారం

ఎస్ఎస్‌తాడ్వాయి: ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండలం కాల్వపల్లి అడవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు శుక్రవారం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. కాల్వపల్లి అటవీ ప్రాంతంలోని బాంచమడుగుపై ఉన్న జులవాడల విప్ప అడవిలో పెద్దపులి సంచరించినట్లు పాదముద్రల ద్వారా గుర్తించినట్లు ప్రచారం అయింది. ఇటీవల మహదేవ్‌పూర్, కాటారం మహాముత్తారం అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరించినట్లు అధికారులు గుర్తించారు. కాల్వపల్లి అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలు కనిపించడంతో భూపాలపల్లి, ములుగు జిల్లా సరిహద్దు అటవీ ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. పెద్దపులి సంచారంపై అటవీశాఖ అధికారులు మాత్ర ధ్రువీకరించలేదు.

మంటగలిసిన మానవత్వం

వడదెబ్బకు గురైన కన్నతల్లికి అంత్యక్రియలు చేయని కొడుకు..

- దహన సంస్కారాలు చేసిన కులస్తులు
- తలకొరివి పెట్టిన పెద్ద కూతురు



మృతి చెందిన రాధమ్మ

చిట్యాల: కన్న తల్లికి అంత్యక్రియలు నిర్వహించకుండా ఇంటికి తాళం వేసి పారిపోయాడు ఆ కొడుకు.. కుల పెద్దలు దహన సంస్కారాలు నిర్వహించగా.. పెద్ద కూతురు నిప్పు పెట్టిన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గోనెల మల్లయ్య–రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు స్వరూప, వసంత, కుమారుడు ఓదెలు ఉన్నారు. ముగ్గురికి వివాహం అయింది. కాగా పదేళ్ల క్రితమే మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ క్రమంలో కొడుకు ఒదెలు తల్లి రాధమ్మతో నిత్యం గొడవ పెట్టుకుని ఆమెను బయటకు గెంటేశాడు. దీంతో ఆ మాతృమూర్తి గ్రామంలోనే ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. గురువారం ఉదయం గ్రామస్తులతో కలిసి ఉపాధి హామీ పనికి వెళ్లిన రాధమ్మ అక్కడే అస్వస్థతకు గురైంది. విషయం తెలిసినా ఉపాధి హామీ పని చేస్తున్న కుమారుడు ఓదెలు పట్టించుకోకుండా ఇంటికి వెళ్లిపోయాడు. గ్రామస్తులు చిన్న కుమార్తెకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకుని తల్లిని తీసుకుని భూపాలపల్లి ఆస్పత్రికి వెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఈక్రమంలో శుక్రవారం తెల్లవారుజామున రాధమ్మ మృతి చెందడంతో చిన్న కూతురు ఇంటికి తీసుకువెళ్లింది. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు ఓదెలు అతని భార్య, కుమార్తెను గ్రామంలో వదిలేసి అతని కుమారుడితో కలిసి వెళ్లిపోయాడు. గ్రామస్తులు అతడి ఆచూకి వెతికినా లభించకపోవడంతో స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడికి చేరుకుని మృతిరాలి కుమార్తెలతో మాట్లాడి అంత్యక్రియలకు ఒప్పించారు. అంత్యక్రియలను కులస్తుల సహకారంతో నిర్వహించగా.. పెద్ద కూతురు స్వరూప తల్లికి తలకొరివి పెట్టింది.